# కథ

"నా భార్యని చంపాలి" ఫకీర్‌తో చెప్పాడు భానుప్రకాష్.

ఫకీర్ భానుప్రకాష్‌ని పరిశీలనగా చూసి, తన ముందు ఉన్న కుర్చీలో కూర్చోమని సైగ చేశాడు. ఫకీర్ సినిమాల్లో చూపించినట్టుగా, గుబురు మీసాలు, కండలు తిరిగిన శరీరంతో వుండడు. సామాన్యమైన ఎత్తుతో, సన్నగా వుంటాడు. కానీ కళ్లలో కఠినత్వం కనిపిస్తుంది.

భానుప్రకాష్ తన చేతిలో వున్న తన భార్య మహలక్ష్మి ఫోటో ఫకీర్‌కి అందించాడు. ఫోటోలో వున్న వ్యక్తిని చూడగానే ఫకీర్ భృకుటి ముడిపడింది. క్షణంలో సర్దుకుని-

# నిశ్శబ్దం



"పది వేలు అవుతుంది. ముందుగా ఐదువేలు అడ్వాన్సుగా ఇవ్వాలి" అన్నాడు ఫకీర్.

ఫకీర్ ఒకసారి డబ్బు తీసుకుంటే చాలు, పని జరిగిపోయినట్టే లెక్క. భానుప్రకాష్ అంగీకారంగా తల ఊపాడు.

"నీ భార్యని ఎందుకు చంపాలి అనుకుంటున్నావు? అక్రమ సంబంధంగాని ఎవరితోనైనా పెట్టుకుందా?" అడిగాడు ఫకీర్.

"అబ్బే అలాంటిది ఏంలేదు" నిజాయితీగా బదులు చెప్పాడు భానుప్రకాష్.

"మరి కట్నం తక్కువ తెచ్చిందా?"

"లేదు, డబ్బై వేలు తెచ్చింది"

"పోనీ నువ్వు ఎవరి ప్రేమలోనైనా పడ్డావా?"

"లేదు"

"మరెందుకు చంపాలని అనుకుంటున్నావు?" అసహనంగా అడిగాడు ఫకీర్.

"నా భార్య మూగది" నింపాదిగా చెప్పాడు భానుప్రకాష్.

"నిన్ను మోసం చేసి పెళ్లి చేశారా?"

"లేదు, కట్నానికి ఆశపడి నేనే పెళ్లి చేసుకున్నాను"

"మరేమిటి ప్రాబ్లమ్?"

"ఆమె 'నిశ్శబ్దం' నేను భరించలేకపోతున్నాను" విసుగ్గా చెప్పాడు భానుప్రకాష్.

"సరే ఐదు వేలు ఇచ్చి వెళ్లు" చెప్పాడు ఫకీర్.

భానుప్రకాష్ ఐదువేలు కట్టని ఫకీర్‌కి ఇచ్చాడు. తరువాత తన ఇంటి అడ్రస్‌తో పాటు కొన్ని ఇంటి గుర్తులు కూడా చెప్పాడు. భానుప్రకాష్ బయటికి నడవబోతుంటే తన క్యాంప్ సంగతి గుర్తు వచ్చింది.

"రేపు సాయంత్రం నేను ఊరికి వెళుతున్నాను. రేపు రాత్రికి పని పూర్తి చేస్తే బాగుంటుంది" నసుగుతూ చెప్పాడు భానుప్రకాష్.

"అలాగే" అంటూ తల ఊపాడు ఫకీర్.

భానుప్రకాష్ అక్కడ నుంచి బయటికి నడిచాడు. ఫకీర్ ఫోటో వైపు చూస్తుంటే అతని కంటిలో నీటి పొర చోటు చేసుకుంది.

★★★

ఫకీర్ నిశ్శబ్దంగా భానుప్రకాష్ ఇంట్లోకి జొరబడ్డాడు.

మహలక్ష్మి వంటింట్లో వుంది. ఫకీర్ మెల్లగా వెళ్లి మహలక్ష్మి రెండు చేతుల్ని వెనక్కి విరిచి పట్టుకున్నాడు. ఆమెకి ఏం జరుగుతోందో అర్థమయ్యేసరికి ఫకీర్ రెండు చేతుల్ని గట్టిగా కట్టేశాడు.

మహలక్ష్మి గట్టిగా అరవాలని అనుకుంది, కానీ, మాట గొంతులో నుంచి బయటికి రాలేకపోయింది. ఆమె గింజుకుంటుంటే, ఫకీర్ బెడ్‌రూమ్‌లోకి ఈడ్చుకుని వెళ్లాడు. తలుపు లోపల గడియ పెట్టాడు. తనతో తెచ్చిన ప్లాస్టిక్ వైర్‌ని సీలింగ్ ఫ్యాన్‌కి ముడివేసి, రెండో కొసని మహలక్ష్మి మెడకి బిగించాడు. ఆమె కళ్లు భయంతో భానుప్రకాష్ కోసం వెదికాయి.

మరుక్షణం ఆమె మెడకి ఉచ్చు బిగుసుకుంది. కొద్దిసేపు మహలక్ష్మి ప్రాణాలు గిలగిల కొట్టుకున్నాయి. మరికొద్ది క్షణాలకి ఆమె ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసిపోయాయి.

ముఖంకి పట్టిన చెమటని తుడుచుకుని బెడ్‌రూమ్ నుంచి బయటికి వచ్చాడు ఫకీర్. ఎదురుగా స్టీల్ బీరువా తెరిచి వుంది. ఫకీర్ పెదవి వికృతంగా విచ్చుకుంది.

అతడు బీరువావైపు కదిలాడు. ఎక్కడ నుంచి ఊడిపడ్డాడో భానుప్రకాష్ బీరువాకి అడ్డంగా నిలబడ్డాడు.

"ఇందా, నీకు రావాల్సిన ఐదువేలు. తీసుకుని బయటికి నడు, లేకపోతే పోలీసులకి ఫోన్‌చేస్తా..." భానుప్రకాష్ మాట ఇంకా పూర్తి కాలేదు, మెరుపు వేగంతో అతని గుండెల్లో కత్తి బలంగా దిగబడింది.

"అమ్మా...." ఒక ఆర్తనాదం భానుప్రకాష్ గొంతు నుంచి బయటికి వెలువడింది.

అంతే భానుప్రకాష్‌కి మెలకువ వచ్చేసింది.

ఎదురుగా మహలక్ష్మి నిలబడి వుంది.

భానుప్రకాష్‌కి అర్థమైపోయింది అంతవరకూ తాను కల గన్నాడని. ముఖంకి పట్టిన చెమటని తుడుచుకుని మౌనంగా బాత్రూమ్‌లోకి వెళ్లిపోయాడు భానుప్రకాష్.

★★★

భానుప్రకాష్ జీపుని స్పీడుగా నడుపుతున్నాడు. అతడికి చాలా ఆనందంగా వుంది. గతరాత్రి ఫకీర్ పని పూర్తి చేసి ఉంటాడు అని అనుకున్నాడు. అతని మనస్సు గాల్లో తేలిపోతోంది.

'యు' కార్నర్ దగ్గరికి జీపు రాగానే కొంచెం స్లో చేశాడు.

అంతే భయంకరమైన శబ్దంతో రోడ్‌సైడ్ పాతిన మందుపాతర పేలింది.

మరుక్షణం దట్టమైన పొగలు చుట్టు అలుముకున్నాయి.

భానుప్రకాష్ అక్కడికక్కడే స్పృహ కోల్పోయాడు.

★★★

భానుప్రకాష్‌కి స్పృహ వచ్చేసరికి హాస్పిటల్ బెడ్ పైనున్నాడు. ఎదురుగా మహలక్ష్మి విచారంగా కనిపించింది.

చుట్టూ నిశ్శబ్దం.

భానుప్రకాష్‌కి ఒక్క క్షణం ఏమీ అర్థం కాలేదు. డాక్టర్ని పిలిచాడు, అతని మాట అతనికే వినపడ్డం లేదు. అయోమయస్థితి. భానుప్రకాష్ మళ్లీ స్పృహ తప్పాడు. అతనిని చూడ్డానికి వచ్చిన వాళ్లతో-

"అతని ప్రాణానికి ఎటువంటి ప్రమాదం లేదు, కానీ మందుపాతర అతి దగ్గరలో పేలడం వల్ల అతని వినికిడి శక్తి పోయింది" బాధగా చెప్పాడు డాక్టర్.

★★★

భానుప్రకాష్ ప్రమాదం జరిగిన తరువాత మనిషి చాలా కృంగిపోయాడు. హాస్పిటల్ నుంచి డిస్చార్జ్ అయిన మూడో రోజు అతని పేర పోస్టులో ఒక రిజిస్టర్ లెటర్ వచ్చింది.

"భానుప్రకాష్! ఇప్పుడు నీ భార్య మూగతనం నిన్ను బాధించదని అనుకుంటున్నాను. మహలక్ష్మి ఎవరో కాదు, నా చెల్లెలు. పేరు మార్చుకుని దేశాలుపట్టి తిరిగే నాలాంటి కొడుకు గురించి నా తల్లిదండ్రులే కాదు, ఏ తల్లిదండ్రులూ కూడా బయటికి చెప్పుకోలేరు. అందువల్లే మహలక్ష్మికి ఒక అన్నయ్య వున్నట్టు నీకు తెలియలేదు.

-ఫకీర్"

అని సంతకం చేసి వుంది.

ఉత్తరం చదవడం పూర్తి అయ్యేసరికి భానుప్రకాష్ ముఖం తెల్లగా పాలిపోయింది.

**టేకి జయప్రకాష్**

★